రాయితీపై బిందు, తుంపర్ల సేద్య పరికరాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కింద అమలవుతున్న బిందు, తుంపర్ల సేద్య పరికరాలను రాయితీపై పొందేందుకు అర్హులైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఎపిఎంఐపి ఆన్‌లైన్ పోర్టల్‌లో త్వరితగతిన నమోదు చేసుకోవాలని జిల్లా పథక సంచాలకులు పి.ఎన్.వి. లక్ష్మీనారాయణ కోరారు. ఈ పథకానికి రాయితీ పొందడానికి రైతులకు బోరు లేదా బావి వంటి నీటి సదుపాయం ఉన్న వారు అర్హులని తెలిపారు. ఐదు ఎకరాల లోపు ఉన్న చిన్న సన్నకారు రైతులకు 90శాతం రాయితీపై గరిష్ఠంగా రెండు లక్షల పదివేల రూపాయలు డ్రిప్ ఇరిగేషన్‌కు రాయితీ ఉంటుందని తెలిపారు. 5 ఎకరాల నుండి 12.50 ఎకరాలు లోపు ఉన్న రైతులకు 50శాతంపై బిందు సేద్యం పరికరాలు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఏడేళ్ల క్రితం మంజూరైన డ్రిప్ వేసుకున్న రైతులు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం రైతులను ప్రోత్సహించే ఈ పథకాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

అమిత్‌షా పర్యటనపై భగ్గుమన్న వామపక్షాలు

- అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి
- విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి
- జిల్లా వ్యాప్తంగా వామపక్షాల నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షాను కేంద్రమంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ, అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాలు ఆదివారం స్థానిక ఆర్‌టిసికాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ (ఎం ఎల్) నాయకులు బెహరా శంకరరావు మాట్లాడుతూ దేశ రాజ్యాంగంపై బిజెపి నాయకులకు నమ్మకం లేదనడానికి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. మరో వైపు ఆంధ్ర రాష్ట్రానికి ఇవ్వాల్సిన విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. ప్రత్యేక హోదా అమలు చేయకుండా ,రైల్వే జోన్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. మరో వైపు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టి దానికి బొగ్గు గనులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు స్టీల్ ప్లాంట్‌ను అమ్మాలని చూస్తున్నారని, ఆ నేపథ్యంలోనే స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. నిధులు కేటాయించడంతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వెంటనే కేంద్రప్రభుత్వం అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివిరమణ, నాయకులు సిహెచ్ వెంకటేష్, అర్.ఆనంద్, వి.లక్ష్మి, సిపిఎంఎల్‌నాయకులు అప్పలరాజు పాల్గొన్నారు.

అమిత్ షా గో బ్యాక్

బొబ్బిలి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా గో బ్యాక్ అంటూ వామపక్ష నేతలు నిరసన తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వస్తున్న అమిత్ షా వెనక్కి వెళ్లిపోవాలంటూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జెండామాల్ జంక్షన్‌లో ఆదివారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, బి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాస్, కోట అప్పన్న మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరం, బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు, కార్యకర్తలు

గజపతినగరం: అమిత్ షా విజయవాడ పర్యటన నిరసిస్తూ మండలంలోని పురిటి పెంట గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్‌పై అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కేంద్రమంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను మనుధర్మ శాస్త్రాన్ని బిజెపి అమలు చేయాలని చూస్తుందని అందులో భాగంగా రాజ్యాంగానికి రాజ్యాంగ విలువలకు, రాజ్యాంగ హక్కులకు ఎటువంటి పాత్ర లేకుండా చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాకోటి రాము, హరికృష్ణ వేణి, జెర్రి రాము, జెర్రి లక్ష్మి, తలే సూరిబాబు, నగర శివ, ఎన్ గౌరీనాయుడు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

గజపతినగరం : పురిటిపెంటలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

శృంగవరపుకోట: ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిపిఎం ఆధ్వర్యాననిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు మాట్లాడుతూ రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా చర్చ జరుగుతున్న సందర్భంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గూర్చి అనుచిత వ్యాఖ్యలు చేశారని, అమిత్‌షా వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లా జగన్, మద్దిల రమణ, చెలికాని ముత్యాలు, ఎం పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: అమిత్‌షా పర్యటనకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు, మద్దిల రమణ, టి వెంకటరమణ, జి ఎర్రమ్మ, కె.ఎల్లమ్మ, బి దేముడు, ఎం సూర్యుడు, కే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: కొత్తవలస అంబేద్కర్ కూడలి, ఉత్తరాపల్లి గ్రామం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో టివి రమణ, బి.దేవుడు. కె ఎర్నమ్మ, బి.ఎర్రమ్మ, ఎం.సూర్యుడు కె.నాగరాజు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక మొయిద జంక్షన్‌లో సిపిఎం, సిపిఐ, న్యూ డెమోక్రసీ, ఆధ్వర్యంలో అమిత్ షా గో బ్యాక్ అంటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మొయిద పాపారావు, న్యూ డెమోక్రసీ నాయకులు కాళ్ళ అప్పల సూరి, కాంగ్రెస్ నాయకులు కనకల పద్మ నాభం, కనకల రాము, సుంకర అప్పారావు, జగ్గిన్ని సత్యారావు, ఎం.అప్పన్న, సిపిఐ నాయకులు పి.సూరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ మందుబాబులను హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, న్యూసెన్సు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్‌పి ఇచ్చిన ఆదేశాలతో యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా జనవరి 18న దాడులు నిర్వహించింది. ఇందులో భాగంగా లే-అవుట్లు, గ్రామ శివారు ప్రాంతాల్లోను, నగర శివారు ప్రాంతాల్లోను, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న 252 మంది మందుబాబులపై కేసులు నమోదు చేసారు. జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా వాహన తనిఖీలను చేపట్టి, పశువులను, మద్యం అక్రమంగా తరలిస్తున్న వారిపై రెండు కేసులు నమోదు చేసి, ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి 8 మద్యం బాటిళ్ళు, 4పశువులను, ఒక వ్యాను సీజ్ చేసారు. వాహన తనిఖీల్లో రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై 386 కేసులు నమోదు చేసి రూ.95,205 ఈ-చలానా విధించారు. సంతకవిటి పోలీసు స్టేషను పరిధిలో పేకాట ఆడుతున్న వారిపై రైడ్ చేసి, నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 16,080 నగదు సీజ్ చేశారు.

నిర్లక్ష్యాన్ని సహించం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఆదివారం సాయంత్రం నగరంలో జరుగుతున్న పారిశుధ్య విధానాన్ని ఆయన పరిశీలించారు. నగరంలో ప్రధాన రహదారులు, కాలువలు జరుగుతున్న పారిశుధ్యం ప్రజలకు ఇబ్బంది లేకుండా జరగాలన్నారు. పారిశుధ్య విధానం సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.

గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పద్మావతి తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డిపద్మావతిని తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా గత వైసిపి ప్రభుత్వం చైర్మన్లుగా నియమితులై ప్రస్తుతం కొనసాగుతున్న వారిని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనేపథ్యంలో రెడ్డి పద్మావతిని చైర్‌పర్సన్ పదవి నుంచి తక్షణమే తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వేమన విగ్రహంతో నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

వేమన పద్యాలతో ఆధ్యాత్మిక జ్ఞానం

ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరంకోట/టౌన్

ఆధ్యాత్మిక కవి వేమన భగవాన్ తన పద్యాలు ద్వారా యావత్తు ప్రపంచానికి ఆధ్యాత్మిక జ్ఞానం తెలియజేసారని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. ప్రబోధసేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వానపల్లి శంకరరావు అధ్వర్యంలో వేమన జయంతి వేడుకలు ఆదివారం టిటిడి కల్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగరంలో వేమన విగ్రహం, చిత్రపటాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేమన సాధారణ వ్యక్తి కాదని అన్నారు. తన పద్యాల ద్వారా ఎంతో ఆధ్యాత్మికత జ్ఞానాన్ని ప్రజలకు తెలియజేశారని వివరించారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ, తూర్పు కాపు సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసలు నాయుడు, రాష్ట్ర బాలల హక్కుల చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు, బాలల న్యాయమండలి సభ్యులు కరణం జనార్ధనరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామానందం, జాతీయ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు బాల బ్రహ్మారెడ్డి, రాష్ట్ర జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వ్యూహాత్మకమా? యాదృచ్ఛికమా?

చిన్న శ్రీనుకు భీమిలి పార్టీ బాధ్యత అప్పగింత • వైసిపి జిల్లా సమన్వయకర్త ఎవరో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వైసిపి జిల్లా సమన్వయ కర్తగా వ్యవహరిస్తున్న మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)కు భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించడం వ్యూహాత్మకమా? లేక యాధృచ్ఛికంగా జరిగిందా? అన్న చర్చ జిల్లాలో సర్వత్రా జరుగుతోంది. భీమిలి నియోజకవవర్గ ఇన్‌ఛార్జిగా నియమిస్తూ వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదలయ్యింది. ప్రస్తుతం ఈ రాజకీయ పరిణామం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇందుకు కారణం లేకపోలేదు. శ్రీనివాసరావు ప్రస్తుతం జెడ్‌పి చైర్మన్‌గా ఉన్నారు. 2019 ఎన్నికలకు ముందు శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణతో కలిసి వైసిపిలో చేరారు. అప్పటికే ఆయన మూడు దశాబ్దాలకుపైగా జిల్లా రాజకీయాల్లో తెరవెనుక పాత్ర పోషిస్తూ వచ్చారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా బొత్స ఆశీస్సులతో పార్టీని విజయవంతంగా ముందుకు నడిపారు. ఈ అనుభవం రీత్యా వైసిపిలో జిల్లా సమన్వయకర్తగా ఎదిగారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో పదికి పది నియోజకవర్గాల్లో గెలుపు వెనుక చిన్న శ్రీను పాత్ర ఉందనడంలో సందేహం లేదు. ఈ రకమైన రాజకీయ చరిత్రే ఆయన్ని గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్‌పి చైర్మన్ పదవికి సునాయాశంగా చేర్చింది. ఈ క్రమంలో అటు జిల్లా పార్టీ బాధ్యతలతో పాటు ఇటు జెడ్‌పి చైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసిపిపై ఉన్న వ్యతిరేకత వల్ల విజయనగరం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఓటమి చవిచూసినప్పటికీ ఉన్నంతలో చిన్న శ్రీను పార్టీని బాగానే నడిపారన్న చర్చ జరిగింది. ఓటమి అనంతరం కూడా అదే పంథా కొనసాగుతోంది. ఈనేపథ్యంలో వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి వద్ద కూడా మంచి గుర్తింపే తెచ్చుకున్నారు. అయితే తాజాగా శ్రీను సేవలను భీమిలి వైపు ఎందుకు మళ్లించారన్న దానిపై ప్రస్తుతం చర్చనడుస్తోంది. దీనిపై రాజకీయ నాయకుల్లో భిన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో శ్రీను ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించారు. ఇందుకోసం అంతకు ఐదేళ్ల ముందు నుంచే ఎస్.కోట, బొబ్బిలి నియోజకవర్గాలపై దృష్టి పెడుతూ వచ్చారు. బొత్సకు సమీప బంధువు కావడం, బొత్స, ఆయన సోదరుడు అప్పలనర్సయ్యలకు జిల్లాలోని చెరో నియోజకవర్గం కేటాయించడం, మరో నియోజకవర్గం లోని ఇదే కుటుంబానికి బంధువుగా వున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు నెల్లిమర్ల కేటాయించడం, మిగిలిన నియోజకవర్గాలు ఇతర సామాజికవర్గాలకు పార్టీ రిజర్వు చేయడం వల్ల శ్రీను వ్యూహం ముందుకు సాగలేదు. ఎన్నికల ముందు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల వైపు చూసినప్పటికీ అక్కడ కూడా పరిస్థితులు అనుకూలించలేదు.

ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్రలో ఎక్కడ టిక్కెట్ ఇచ్చినా పోటీకి తాను సిద్ధమేనని కూడా అధిష్టానం వద్ద చెప్పినప్పటికీ, ఇందుకు పార్టీ అధినేత సున్నితంగా తిరస్కరించారట. ప్రస్తుత పరిస్థితుల్లో 'నువ్వు ఎమ్మెల్యే కావడం కన్నా పార్టీ కోసం పనిచేసి, ఎక్కువ సీట్లు గెలుపునకు తోడ్పాటునందించడమే మేలు' అని జగన్ సముదాయించారట. వచ్చే ఎన్నికల్లో తప్పక అవకాశం వస్తుందన్న మాట కూడా ఇచ్చినట్టుగా అప్పట్లో ప్రచారం జరిగింది. అధినేత ఆదేశాలే తడవుగా గడిచిన ఎన్నికల్లో పార్టీకోసం పనిచేశారు. ప్రస్తుతం వచ్చే ఎన్నికలే లక్ష్యంగా పార్టీ అధినేత జగన్ ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా పార్టీని బలోపేతం చేసుకునేందుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జులను అక్కడక్కడ మారుస్తున్నారని, శ్రీనుకు భీమిలి బాధ్యతలు కూడా అందువల్లే అప్పగించారని పలువురు అంటున్నారు. అలా అయితే, మన జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గాన్ని కేటాయిస్తారు కదా? అంటూ కొందరు ప్రశ్నిస్తుండగా, గత ఎన్నికల మాదిరిగానే వచ్చే ఎన్నికల్లో కూడా ఒకే కుటుంబానికి ఇన్ని ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తే ఎలా? అని ప్రశ్నించినవారికి సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఎదురవ్వవచ్చని, అందుకే శ్రీనును విశాఖ జిల్లా వైపు మళ్లిస్తున్నారని మరికొందరు విశ్లేషిస్తున్నారు. ఈ పరిణామాల వెనుక మరో విశ్లేషణ కూడా వినిపిస్తోంది. జిల్లాలో ప్రస్తుతం చిన్న శ్రీను ఏక చక్రాధిపత్యం చేస్తున్నప్పటికీ, పార్టీలో కింది నుంచి పైవరకు బొత్స మాటకు తిరుగులేదు. బొత్స ఇటీవల విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. విశాఖ కేంద్రంగా ఆయన రాజకీయాలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఆయన కుమారుడు బొత్స సందీప్ చీపురుపల్లి నియోజక వర్గాన్ని అంటిపెట్టుకుని ఉంటున్నారు. ఇదే నియోజక వర్గంలో చిన్న శ్రీనుకు మంచి పట్టుంది. ఈనేపథ్యంలో బొత్స వారసుడిగా సందీప్‌ను చీపురుపల్లిలోగానీ, జిల్లాలోగానీ తెరపైకి తీసుకురావాలంటే శ్రీన్న శ్రీను లాంటి బలమైన నాయకుడికి ప్రత్యామ్నాయం చూపించాలని, అందుకే అటు అధిష్టానం, ఇటు బొత్స కలిసి శ్రీనును భీమిలి వైపు మళ్లించారనే చర్చనడుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో జిల్లా పార్టీ సమన్వయ కర్తగా శ్రీనునే కొనసాగిస్తారా? లేక మారుస్తారా? అన్న సందేహాలు కూడా వ్యక్తమౌతు న్నాయి. ఎమ్మెల్యే కావాలన్న ఆకాంక్షతోవున్న శ్రీనుకు ఈ పరిణామాలు కొంచెం ఇష్టంగాను, కొంచెం కష్టంగాను ఉంటాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులూ శిక్షార్హులే

- వాహనదారులూ తస్మాత్ జాగ్రత్త
- నెల రోజుల పాటు రోడ్డు భద్రతా మాసోత్సవాలు
- డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మణికుమార్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ద్విచక్ర వాహనం మొదలుకొని ఏ వాహనమైనా రోడ్డు ఎక్కాలంటే ఖచ్చితంగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని, అందుకు సంబంధించి అధికారుల నుంచి దపత్రాలు పొందాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డి. మణికుమార్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నెల రోజులు పాటు రహదారి భద్రతా మాసోత్సవాలు నిరహిస్తున్నట్లు చెప్పారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులు శిక్షార్హులని, వాహనదారులంతా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. శనివారం ఆయన ప్రజాశక్తికి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.

రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు ?

- ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నెలరోజుల పాటు జిల్లా వ్యాప్తంగా రహదారి భ్రదతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. దీనిలో భాగంగా అవగాహన సదస్సులు, హెల్మెట్ల వినియోగంపై అవగాహన వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నాం. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ తో సమన్వయం చేసుకుంటూ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లకు కంటి పరీక్షలు, షుగర్ పరీక్షలు చేయించి మందులు కూడా రవాణా శాఖ అందిస్తోంది. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ యూనిట్లను భాగస్వామ్యం చేస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎన్‌జిఒ, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు కూడా శిక్షార్హులే అని తెలియజేస్తున్నాం.



మీ పరిధిలో బ్లాక్ స్పాట్స్ ఎక్కడెక్కడ గుర్తించారు అక్కడ ఏ విధమైన చర్యలు చేపడుతున్నారు ?

- రవాణాశాఖ పరిధిలో 40 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించాం. అక్కడ టెంపరరీ పర్మినెంట్ చర్యలు అనేవి చేపట్టబోతున్నాం. వీటిపై డిఆర్‌సి మీటింగ్ లో కలెక్టర్ ఆధ్వర్య ంలో నిర్ణయాలు తీసుకుంటాం. సైన్ బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నాం.

గత ఏడాది ఎన్ని రోడ్డ ప్రమాదాలు సంభవించాయి? గతం కంటే పెరిగాయా? తగ్గాయా?

- 2023 సంవత్సరం కంటే 2024లో రోడ్డు ప్రమాదాల మరణాలు తక్కువగా సంభవించాయి. ప్రమాదాలు కూడా తక్కువే.

జిల్లా వ్యాప్తంగా ద్విచక్ర వాహనాలు, త్రీ టైర్, ఫోర్ వీలర్స్ వెహికల్స్ ఎన్ని ఉన్నాయి?

- అన్నీ కలిపి సుమారుగా 5 లక్షల వాహనాలు ఉన్నాయి, ఇందులో ద్విచక్ర వాహనాలు 3లక్షల 80 వేల వరకు ఉండవచ్చు. లక్ష పైన ఫోర్ వీలర్స్, 5వేల పైబడి ఆటోలు ఉన్నాయి.

జిల్లాలో స్కూల్స్ బస్సులు ఎన్ని ఉన్నాయి ?

- జిల్లాలో 500 స్కూల్ బస్సులు ఉన్నాయి. వీటన్నిటిపైనా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాం. 98శాతం వరకు పూర్తయ్యింది. రెగ్యులర్‌గా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ తో పాటుగా మితిమీరిన ప్రయాణికులతో వెళుతున్న వాహనాలపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

- గత మూడు నెలల్లో సెల్‌ఫోన్ మాట్లాడుతూ వెళ్తున్న టూ వీలర్స్ వాహనదారులపై కేసులు బుక్ చేస్తూ 80 లైసెన్సులను మూడు నెలలపాటు సస్పెండ్ చేశాం. వీరంతా ఎక్కువగా 20 నుంచి 30 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారే. స్పీడ్‌గా వెళ్లడంతోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మైనర్లకు వాహనాల ఇస్తే పూర్తి బాధ్యత తల్లిదండ్రులదే . అటువంటి తల్లిదండ్రులకు శిక్ష తప్పదు.

డ్రైవింగ్ లైసెన్స్ జారీ విధానంలో ఎటువంటి మార్పులు చోటు చేసుకున్నాయి?

- రాష్ట్రంలో డ్రైవింగ్ లైసెన్సు పాత విధానమే కొనసాగుతోంది. ఏజెంట్లను ఆశ్రయించకుండా ఎవరైనా నేరుగా కార్యాలయానికి వచ్చి లైసెన్సు పొందవచ్చు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పలు సంఘాల నాయకులు

కార్మిక సమస్యలపై గాంధీ విగ్రహానికి వినతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆదివారం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలతో కూడిన వినత పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు మాట్లాడుతూ కార్మిక సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా ఆయా రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యల పైన ఆయా రంగాలపైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి పైన మహాత్మా గాంధీకి వినతి పత్రం ఇస్తున్నామన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక వ్యతిరేక చట్టాలు, రైతాంగానికి వ్యతిరేకంగా వ్యవసాయ రంగంలో మార్పులు చట్టాలు తీసుకు వచ్చారన్నారు. సోమనాధన్ కమిటీ సిఫార్సులు అమలుచేస్తానని గద్దెనెక్కిన బిజెపి నేటికీ అమలు చేయలేదని రైతన్నలు ఢిల్లీ నడిబొడ్డున శాంతియుత నిరసన కార్యక్రమం చేపడితే అతి దారుణంగా బిజెపి 753 మంది రైతన్నలను పొట్టన పెట్టుకుందన్నారు. బిజెపి దుర్మార్గ విధానాలు మార్చుకొని రైతులకు అనుకూలంగా నడుచుకోవాలని, కార్మికవర్గాన్ని యజమానులకు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రోజువారి కూలి రూ.600 ఇవ్వాలని సంవత్సరంలో ప్రతి జాబ్ కార్డుకు 200 రోజులు పనిదినాలు కల్పించాలని కోరారు. కార్మికులకు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలి కాని ముత్యాలు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కొత్తవలస

మాట్లాడుతున్న వైద్యాధికారి గోపాలకృష్ణ

కుష్ఠు వ్యాధి ఇంటింటి సర్వే చేసి అనుమానిత కేసులను గుర్తించండని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యధికారి డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం వియ్యంపేటలో సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్ఠు వ్యాధి గ్రాస్తులను గుర్తించే కార్యక్రమం లేప్రోసి కేసు డిటెక్షన్ కాంపెయిన్‌లో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ఏ.ఎన్.ఎమ్, ఆశ వర్కర్స్ కుష్ఠు వ్యాధిగ్రాస్తులను గుర్తించి, కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కుష్ఠు వ్యాధికి మందులన్నీ ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉచితంగా దొరుకుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, హెచ్‌వి పద్మావతి, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

అవగాహన కల్పిస్తున్న సిఐ సతీష్

ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ కోరారు. పాత బొబ్బిలి కూడలిలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా ఆదివారం గాంధీ స్మారక నిధి ఆధ్వర్యంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహనంపై ఇద్దరుకు మించి ప్రయాణం చేయకూడదని చెప్పారు. లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాంధీ స్మారక నిధి అధ్యక్షుడు ఎం.వినయమోహన్, వనమిత్ర అధ్యక్షుడు కృష్ణదాసు, చిన్నారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - తెర్లాం

విద్యార్థి దశలోనే పిల్లలు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని శాఖాగ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లలచే పుస్తక పఠనం చేయించారు. చదవడం, రాయడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా పిల్లలతో నీతి కథలు, పురాణాలు, ఇతిహాసాలు చదివించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రాన్నిస్తున్న సోంపురం గ్రామస్తులు

రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

వేపాడ మండలంలోని సోంపురం గ్రామానికి రోడ్డు నిర్మించాలని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే లలితకుమారికి ఎల్‌కోటలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కల్లాలకు ఆర్‌అండ్‌బి రోడ్డు నుండి 1.4 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బి అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గొర్రెపోతు రాము, లెక్కల సత్యనారాయణ, మల్ల రమణ, జె రాము, జి. నల్ల బాబు, జి శేఖర్, సిహెచ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌టిసి మేనేజర్ రమేష్

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి- శృంగవరపు కోట

ఆర్‌టిసిలో ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు అవసరమని డిపో మేనేజర్ రమేష్ తెలిపారు. ఆర్‌టిసిలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక ఆర్‌టిసి డిపోలో సిబ్బందికి ఆయన ప్రమాదాల నివారణకు డ్రైవర్లు పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా డ్రైవర్లు డ్యూటీ లేని సమయంలో తగిన విశ్రాంతి తీసుకొని ఏకాగ్రతతో బస్సులు నడపాలన్నారు. మెకానిక్కులు బస్సును మంచి కండిషన్‌లో ఉంచాలన్నారు. ప్రతి రోజు డిపో సిబ్బందికి రహదారి భద్రత గురించి అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. అనంతరం భద్రత పై ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన చుక్కమాంబ జాతర

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని అరిగిపాలెం గ్రామ దేవత చుక్కమాంబ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. యాత్రికులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

యువకులను అభినందిస్తున్న సిఐ, ఎస్ఐ

ఆకట్టుకున్న సైబర్ మోసాల లఘు చిత్రం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన కొంతమంది యువకులు సైబర్ మోసాలపై తీసిన లఘు చిత్రం ఎంతగానో ఆకట్టుకుందని సిఐ ఎన్‌వి ప్రభాకర్ అన్నారు. ఈ లఘు చిత్రాన్ని ఆదివారం పోలీస్ స్టేషన్‌లో సిఐ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసి డబ్బును కొల్లగొడుతున్నారన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపిలు చెప్పమన్నా, బ్యాంకు వివరాలు అడిగిన చెప్పవద్దని వివరించారు. లఘు చిత్రాన్ని నిర్మించిన యువకులు రాజు లక్కీ, శ్రావణ్ కుమార్, వెంకటేష్, ప్రసాద్, మహేష్, రాజులను సిఐ మెచ్చుకున్నారు. ఇలాంటి చిత్రాలతో సమాజంలో కొంత మార్పు వస్తుందని వారికి తెలిపారు. ఎస్ఐ సూర్య కుమారి, లింగాలవలస యువకులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటల పెంపకంపై ఆసక్తి

● ప్రత్యేక రాయితీలు ఇవ్వడంతో ముందుకొస్తున్న రైతులు ● అంతర్ పంటలకూ అవకాశం ఉండటంతో మొగ్గు ● మండలంలో 40 ఎకరాల్లో సాగు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండగట్టుపూడి, ఎస్‌కోట, సీతారాంపురం, వీలుపర్తి, వేపాడ, వావిలపాడు, బల్లంకి, నల్లబెల్లి, కొలుకుపాలెం, గ్రామాలలో రైతులు పామాయిల్ తోటల పెంపకానికి ముందుకు వస్తున్నారు. రోజురోజుకు వంట నూనెల ధర ఆకాశాన్నంటడం, వంట నూనే వాడకం అధికంగా ఉండటంతో విదేశాల నుంచి నూనె గింజలను దిగుబడి చేసి ఇతరులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దిగుబడి శాతాన్ని తగ్గించి స్థానిక రైతులకు ఆదాయం పెంచడానికి అణువుగా పామాయిల్ తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే మండలంలోని 40 ఎకరాల్లో పామాయిల్ తోటలను రైతులు వేశారు. 30 ఏళ్ల ఆదాయం వచ్చే అనువైన పంటగా పామాయిల్‌ను అధికారులు కూడా ప్రోత్సహిస్తున్నారు. ఆరోగ్యం కలిగించే పామాయిల్ తోటలు రైతులకు ఆదాయాన్ని పెంచుతుంది.

అత్యధిక నూనె దిగుబడి ఇచ్చే పంటల్లో పామాయిల్ తోట ఒకటి. పామాయిల్ ఎకరాకు 8 టన్నుల గెలలు దిగుబడి ఇస్తుంది. దీంతో పామాయిల్ తోటలు పెంపకం రైతులకు రాయితీ ఇస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లా నేషనల్ మిషన్ ఫర్ ఆయిల్ ఫామ్ ద్వారా ప్రభుత్వం రైతులకు లబ్ధి చేకూరుస్తుంది. జిల్లా ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు శ్రీనివాస ఆయిల్ ఫామ్ కంపెనీ మొక్కలు పంపిణీ చేస్తుంది. మొక్కలు ఎకరా విస్తీర్ణంలో త్రిభుజాకారంలో 57 నాటుతారు. బోరు, గెడ్డ, నీటి కాలువ సౌకర్యం ఉన్న రైతులకు మొక్కలు మంజూరు చేస్తారు. మండలంలో పామాయిల్ సాగు చేసిన రైతుల వద్దకు నేరుగా శ్రీనివాస పామాయిల్ కంపెనీ వారే స్వయంగా వచ్చి పండిన పంటను కొనుగోలు చేస్తారు. పంట రవాణా కూడా రైతుకు ఇబ్బంది ఉండదు. జిల్లా ఉద్యానవన శాఖ మూడేళ్ల పాటు పంట నిర్వాహణ ఖర్చులు కూడా రైతు ఖాతాకు జమ చేస్తుంది.

వంట నూనె ధరలు సలసల కాగిపోతున్న తరుణంలో విదేశాల నుంచి దిగుబడి చేసిన వంట నూనెలను కొనాలంటే మరింత ఇబ్బందని గుర్తించి రైతులు నేరుగా పామాయిల్ తోటలు వేసేందుకు నడుం బిగించారు. దీనికి ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందిచడంతో రైతులు పామాయిల్ తోటలు వేసేందుకు ముందుకు వస్తున్నారు. కాగా పామాయిల్ తోటల్లో అంతర పంటలను కూడా పండించి సొమ్ము చేసుకోవచ్చునని గ్రహించిన మండల రైతులు ఇప్పటికే 16 హెక్టార్లలో పామాయిల్ తోటలు వేసి అందులో అంతర్ పంటలుగా కూరగాయలు, పూలు, అరటి, పసుపు, అల్లం, పైనాపిల్ వంటివి వేసి అధిక ఆదాయాన్ని రాబడుతున్నారు. వీరికి ప్రభుత్వం కూడా పెద్ద మొత్తంలో రాయితీలు ఇవ్వడంతో మరింత మంది రైతులు పామాయిల్ తోటలు పెంచేందుకు ఆశక్తి చూపిస్తున్నారు.

పామాయిల్ తోట పెంచే రైతులకు ప్రయోజనాలు

ఏడాది పొడుగునా నెలసరి ఆదాయం మార్కెట్ ధరకే హామీ ఉంటుంది. పామాయిల్ పంటకు దొంగల భయం ఉండదు. ఇతర అవసరాలకు ఉపయోగపడదు. ఆయిల్ ఫామ్ పంటలో తెగుళ్ళు, వ్యాధులు చాలా తక్కువ. మొదటి మూడేళ్లలో ఏక వార్షిక పంటలైన కూరగాయలు, పూలు, అరటి, పసుపు, అల్లం, పైనాపిల్ పంటలు అంతర్ పంటలుగా వేసుకోవచ్చు. అంతర పంటలుగా నీడను ఇష్టపడే పంట కోకో వంటి అంతర పంట సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. ఆయిల్ ఫామ్ 4-6 ఏళ్ల గల తోట నుంచి ఒక ఎకరాకి ఎనిమిది నుండి పది టన్నులు దిగుబడి వస్తుంది.

ఆయిల్ ఫామ్ రైతులకు రాయితీలు

ఆయిల్ ఫామ్ సాగులో రెండు రకాల మొక్కలను సాగు చేసుకునేటందుకు వీలుంటుంది. స్వదేశీ రకం ఒక్కొక్క మొక్కకు 133 రూపాయిలు, దిగుమతి మొక్క రకంకు 193 రూపాయలు రాయితీని ప్రభుత్వం అందిస్తుంది. ఇవి ఎకరాకు 60 మొక్కలు చొప్పున నాటాలి. ఒక ఎకరాకి ఇండిగో నియస్ రకానికి రూ.8వేలు సబ్సిడీ. ఎగుమతి రకానికి 11,600 రూపాయలు చొప్పున ప్రభుత్వం రాయితీ ఇస్తుంది.

వావిలిపాడులో ఏపుగా పెరిగిన పామాయిల్ తోట

రైతులకు ప్రోత్సాహకాలు

ఆయిల్ ఫామ్ మొక్క కొనుగోలుకు ప్రభుత్వం స్వదేశీ రకానికి రూ.20వేలు, దిగుమతి రకానికి రూ.28,400 రాయితీ కల్పిస్తుంది. మొదటి నాలుగేళ్ల వరకు ఖర్చుల కోసం ఏడాదికి రూ.5,250 చొప్పున హెక్టారుకు రూ.21వేలు రాయితీ ఇస్తోంది. సాగుకు అవసరమైన బిందు సేద్యం పరికరాలను కూడా చిన్న సన్న కారు రైతులకు అందిస్తోంది. జాబు కార్డు ఉన్న చిన్న, సన్న కారు రైతులకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తుంది.

- లక్ష్మీనారాయణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, విజయనగరం

టిడిపిలో మూడు ముక్కలాట

● ఎమ్మెల్సీ, గొంప గ్రూపులకు కోళ్ల చెక్ ● ఎన్ఆర్ఇజిఎస్ పనుల్లో మొండి చేయి ● నీటి సంఘం ఎన్నికల్లోనూ అదే పరిస్థితి

ప్రజాశక్తి - జామి

టిడిపిలో మూడు ముక్కలాట తమ్ముళ్లను ముప్పు తిప్పలు పెడుతోంది. గత ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా, టిడిపి అధిష్టానం అటు వైసిపి విభేధాలతో వచ్చిన ఎమ్మెల్సీ రఘురాజును, రెబల్‌గా పోటీకి సిద్ధమవుతున్న గొంప కృష్ణను బుజ్జగించి, కోళ్ల గెలుపునకు సహకరించమని కోరిన విషయం తెలిసిందే. అందుకు ఆయా నేతలకు టిడిపి పెద్దలు భారీగానే హామీలు గుప్పించారు. తీరా ఎన్నికల్లో కోళ్ల గెలిచికా సీన్ రివర్స్ అయ్యిందని తమ్ముళ్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొంప కృష్ణ ఎన్ఆర్ఐగా నియోజకవర్గం ప్రజలకు పరిచయమై, పార్టీ బలోపేతానికి కృషి చేసిన విషయం తెలిసిందే. టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు కష్టబడుతున్నానని చెప్పిన గొంప వెనకాల ఐదు మండలాల నాయకులు నడిచారు. టిక్కెట్ రాకపోవడం, రెబల్‌గా పోటీకి సిద్ధమవడం అధిష్టానం నచ్చ చెప్పడం ఇవన్నీ సందర్భల్లోనూ ఆయన గ్రూపు మాత్రం టిడిపి వెంటే ఉంది. కానీ కోళ్ల గెలిచిన తర్వాత మాత్రం గొంప గ్రూపు పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా ఎమ్మెల్యే కోళ్ల, ఆమె భర్త రాంప్రసాద్ కంకణం కట్టుకున్నారని గొంప గ్రూపు ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఇటీవల నీటి సంఘం ఎన్నికల్లోనూ గొంప గ్రూపునకు చెందిన ఏ ఒక్కరికీ అవకాశం దక్కకుండా ఎమ్మెల్యే పట్టుబట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల విషయాన్ని పక్కన పెడితే, గ్రామాల్లో ఉపాది హామీ నిధులతో వెండర్ విధానంలో చేపడుతున్న మెటీరియల్ కాంపోనెంట్ వర్కుల విషయంలోనూ గొంప గ్రూపునకు మొండి చేయి తప్పలేదు. ఇవే కాదు, గొంప గ్రూపునకు చెందిన వారికి చిన్న పని కూడా జరగకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఉద్యోగుల నియామకాల్లో పూర్తిగా తమ చెప్పు చేతల్లో ఉన్న, అధికారులను నియమించుకుని గొంప గ్రూపునకు చెందిన నాయకులు పనులు చేయకుండా అడ్డుకుంటున్నట్లు ఆవేదన చెందుతున్న పరిస్థితి. జామి మండలంలో సీనియర్ టిడిపి నాయకులు లగుడు సింహాద్రి కుమారుడు లగుడు రవికుమార్ విషయంలోనూ పరాభవం తప్ప లేదంటే, రెండు గ్రూపుల మధ్య విభేధాలు ఎంత తీవ్ర స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఎమ్మెల్సీ రఘురాజుకు, ఎమ్మెల్యే కోళ్ల మధ్య కోల్డ్ వార్ నడుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు అనర్హత వేటును తప్పించుకుని మళ్ళీ ఎమ్మెల్సీగా రంగ ప్రవేశం చేసిన తర్వాత విభేధాలు తారాస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కావడం, సర్పంచుల అధికారాలను కూటమి ప్రభుత్వం వెండర్ విధానంతో దెబ్బతీయడంతో గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసిలు ఆవేదన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే గ్రామ స్థాయి నాయకుల్లో అత్యధికులు ఎమ్మెల్సీ రఘురాజు అనుచరులు ఉండడంతో రఘురాజు బహటంగానే సర్పంచులకు అండగా నిలుస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్సీ గ్రూపును అనగ తొక్కుతున్నారని చర్చ లేకపోలేదు. అందులో భాగంగానే వర్కులు కేటాయింపులోనూ ఎమ్మెల్సీ గ్రూపునకు ఎదురు దెబ్బ తగిలినట్లు సమాచారం.

వాస్తవానికి కోళ్ల గెలుపులో ఎమ్మెల్సీ రఘురాజు పాత్ర ఎక్కువే. ఒక దశలో కోళ్ల ఓడిపోతారన్న ప్రచారాన్ని తిప్పి కొట్టి చాలా గ్రామాల్లో వైసిపి నాయకులను మార్చి, పరోక్షంగా రఘురాజు ఆమె గెలుపునకు కృషి చేశారని టిడిపి కార్యకర్తలు సైతం చర్చించుకున్నారు. కానీ అటువంటి రఘురాజు గ్రూపును కూడా పక్కన పెట్టి, తమ టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడం ఎమ్మెల్సీ గ్రూపునకు మింగుడు పడడం లేదు. ఈ నేపథ్యంలోనే ఎస్‌కోట నియోజకవర్గంలో గ్రూపుల పోరు ఇటు తమ్ముళ్లను, అటు ఎమ్మెల్సీ గ్రూపును ఇబ్బందులు పాలు చేస్తుందన్న చర్చ సర్వత్ర నడుస్తోంది. ఇప్పటికైనా ఎమ్‌పి భరత్ చొరవ తీసుకొని విభేధాలకు చెక్ పెట్టాలని పలువురు టిడిపి ద్వితీయశ్రేణి నాయకులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-గజపతినగరం

సరిగ్గా 35 సంవత్సరాల క్రితం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. 1984 - 89 మధ్యకాలంలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఎన్నో ఏళ్ల తరువాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ, కష్టసుఖాలు తెలుసుకుంటూ పరవశించిపోయారు. స్థానికంగా ఉన్న వారితో పాటు రాష్ట్రంలో నలుమూలల, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలవడంతో వారి ఆనందానికి హద్దుల్లేవు.

తామంతా ఒకచోట కలుసుకోవాలి కొద్దిరోజుల క్రితం అనుకున్నారు. కొన్ని నెలల క్రితం అందుబాటులో ఉన్న కొద్ది మందితో సమావేశం ఏర్పాటు చేసుకుని, అందరి నెంబర్లు సేకరించి సమాచారం చేరవేశారు. జనవరి 19న అందరం పాఠశాల ఆవరణలో కలుసుకోవాలని, తమకు ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకోవాలని నిర్ణయించుకున్నారు. అందుకు తగ్గట్టుగానే ఆదివారం వారు చదువుకున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను వేదికగా చేసుకున్నారు. ఒకరిని చూసి మరొకరు మురిసిపోతూ.. చదువుకున్న రోజుల జ్ఞాపకాలు నెమరేచుకుంటూ ఆనంద భరితులయ్యారు. అప్పుడే వేదిక వద్దకు వచ్చిన తమ గురువులు అప్పటి ప్రధానోపాధ్యాయులు అల్లు అప్పలస్వామి, ఉపాధ్యాయులు మద్రాపు వేణు, కెబిఆర్ ఆచార్యులు, మృత్యుంజయరావు, పద్మావతి, వరలక్ష్మి, దైవకృప, శిరోమణి, సన్యాసిరాజులను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు కెవివిఎస్ నారాయణ, మదన్మోహన్, అసి రాడ పద్మ, గుప్త, గాయత్రి హాస్పిటల్ అధినేత్రి బెల్లాన వంశీ పావని, బొండపల్లి ఎంఇఒ అల్లు వెంకటరమణ, వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న ఆముదాల రమ, బి. శివాజీ, వ్యాపార వేత్తలు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మధురానుభూతులు పొందారు. ఇకనుంచి ప్రతి ఏడాది తమ క్లాస్మేట్స్ అందరూ కలుసుకోవాలని, తాము చదువుకున్న ఈ పాఠశాలకు తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా నిర్ణయించుకున్నారు.

గజపతినగరం: ఒకేచోట కలిసిన పూర్వ విద్యార్థులు

వేపాడ: ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిసాం.. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ శ్రీవివేకానంద విద్యాసంస్థల విద్యార్థులు ఇంటర్, డిగ్రీ 2009-2014 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ముందుగా కళాశాల కరస్పాండెంట్ సిహెచ్ ఆర్‌కె ప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. పలు ప్రాంతాలలో స్థిరపడిన వారంతా ఒకేచోటకు చేరుకొని అప్యాయంగా పలకరించుకున్నారు. సభలో ఒకరినొకరు ఆలింగనం చేసుకొని నిక్‌నేమ్‌లతో పిలుచుకున్నారు. తీపి జ్ఞాపకలను గుర్తు చేసుకొంటూ యోగాలను గురించి వివరించుకున్నారు. పాఠాలను నేర్పించిన ఉపాధ్యాయులను సత్కరించారు. 15 ఏళ్ల నాటి విద్యార్థులను చూసిన ఉపాధ్యాయులు తన్మయత్వంతో మునిగిపోయారు. అనంతరం పూర్వ విద్యార్థులు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందరికీ పరిచయం చేశారు. ఒకరి యోగ క్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. వివిధ హోదాల్లో పూర్వ విద్యార్థులు ఉన్నారని, ఇంకా మరిన్ని విజయాలు సాధించాలని ఉపాధ్యాయులు కోరారు. విద్యార్థులకు చదువు చెప్పిన అప్పటి గురువులను దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలతో పశువులకు రక్షణ

మండల పశువైద్యాధికారి హైమావతి

ప్రజాశక్తి- మెరకముడిదాం

పశు ఆరోగ్య శిబిరాలతో పశువులకు రక్షణ లభిస్తోందని మండల పశువైద్యాధికారి సిహెచ్ హైమావతి అన్నారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో అన్ని పంచాయతీల్లో సోమవారం నుంచి జరగబోవు పశుఆరోగ్య శిబిరాలు ద్వారా పశువులకు అన్ని రకాల రక్షణ లభిస్తుందని, పశు పోషకులు ఈ శిబిరాలను వినియోగించు కోవాలని కోరారు. పశువుల ఆరోగ్యాన్ని ఉత్పాదకతను పెంచటానికి, వ్యాధులను నియంత్రించటానికి, పశుపోషణ ఖర్చులు తగ్గించటానికి, పశుపోషక సేవలను పశుపోశకులకు మరింత దగ్గర చేయటానికి ప్రభుత్వం ఆరోగ్య శిబిరాలను పదిరోజులు పాటు నిర్వహిస్తు ఒదన్నారు. ఈ శిబిరాల్లో పశువులకు, దూడలకు సన్న జీవులకు నట్టల మందులు ఉచితంగా వేస్తామని, ఎదకు వచ్చిన పశువులకు ఎద ఇంజంక్షన్స్ చేస్తామని, చూడు పరీక్షలు నిర్వహించి, ఎదకు రాని, చూలు కట్టని గర్భ కోస వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగు వైద్యం అందిస్తామన్నారు. ప్రస్తుతం అమలవుతున్న మినీ గోకులాలు, బహువార్షిక పశుగ్రాశాల సాగు, పశుకిషన్ క్రెడిట్ కార్డ్స్, లింగ నిర్ధారణ వీర్యం గురించి శిబిరాల్లో రైతులకు వివరిస్తామన్నారు.

డాక్టర్ హైమావతి

తెర్లాం: మండలంలోని రైతులందరూ పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్ర కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పశుఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తా మన్నారు. మొదటి రోజు మోదుగువలస గ్రామంలో శిబిరం నిర్వహించి పశువులకు నట్టల నివారణ మందులు, టీకాలు వేయడం, గర్భాశయ వ్యాధులకు, సాధారణ వ్యాధులకు చికిత్స చేస్తామన్నారు. ఈ కార్య క్రమాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు.

దత్తిలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ దత్తి గ్రామంలో మరిడిమాంబ తీర్థ మహోత్సవం సందర్భంగా మరిడిమాంబ వాలీబాల్ అసోసియేషన్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను టిడిపి మండల అధ్యక్షుడు గొల్లపల్లి రాము, కోళ్ల వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులలో మానసిక ఉల్లాసం పెరగాలంటే క్రీడలను ఎంచుకోవాలన్నారు. క్రీడల్లో రాణిస్తే యువతకు క్రీడారంగంలో ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ వాలీబాల్ పోటీలకు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి కె.కృష్ణంరాజు పరిశీలకులుగా వ్యవహరించారు. ఇందులో ప్రథమ బహుమతి గెలిచిన వారికి రూ.10వేలు, ద్వితీయ బహుమతి గెలిచిన వారికి రూ.8వేలు, తృతీయ బహుమతి గెలిచిన వారికి రూ.6వేలు నాల్గో స్థానం వారికి రూ.4 వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందించారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కొరుపోలు అప్పారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలీలపై కత్తితో దాడి

ప్రజాశక్తి- భోగాపురం

విమానాశ్రయ నిర్మాణ కూలీలను సూపర్ వైజర్ కత్తితో పొడిచిన ఘటన లేబర్ గృహ సముదాయాల వద్ద శనివారం రాత్రి జరిగింది. ఇందులో ఇద్దరికి గాయాలు అవడ ంతో తగరపువలస లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రామ్‌కుమార్ బోయ, చోటుకుమార్ విమా నాశ్రయ నిర్మాణంలో కూలీలుగా పనిచేస్తు న్నారు. ఈ రోజు ఏమేమి పనులు చేశారని సూపర్ వైజర్ మున్నా శనివారం రాత్రి ఈ ఇద్దరు కూలీలను ప్రశ్నించాడు. సెలవులో ఉన్న నీకు ఎందుకు చెప్పాలంటూ వీరిద్దరూ తిరిగి ప్రశ్నించారు. మద్యం మత్తులో ఉన్న సూపం్‌వైజర్ కోపంతో రెచ్చిపోయి పక్కనే ఉన్న కాయ గూరల కత్తితో ఇద్దరిపై దాడి చేశాడు. వీరిద్దరూ ప్రస్తుతం ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందు తున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరికుప్పలు దగ్ధం

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని సుందరాడ కల్లాల్లో ఆదివారం సాయంత్రం నాలుగు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రేజేటి లక్ష్మి, ముత్త నగేష్, ముత్త తిరుపతి, కుసుమూరు పెంటయ్యలకు చెందిన వరి కుప్పలు దగ్ధమ య్యాయని గ్రామస్తులు చెబుతున్నారు. రాజాం ఫైర్ స్టేషన్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

VIZIANAGARAM MUNICIPAL CORPORATION

e-Proc.short NIT No.756/16/E/TO/2024-25, Dt.18-01-2025

Supply and delivery of 25 lts capacity HDPE dust bins, Welding Machine, Providing of Snake Prevention services, Engaging of 4 nos. of Tractors with trailors etc., Approx. Est Cost Rs.34.96 Lakhs.

Download start date & time	Dt.20-01-2025 from 10.30 A.M.
Download end date & time	Dt.23-01-2025 upto 10.30 A.M.
Bid Submission Closing Date&Time	Dt.23-01-2025 upto 11.00 A.M.
Bid opening date & time	Dt.23-01-2025 after 11.30 A.M.

Contact Nos.9849906481, 9849908295. Further details can be seen at www.apeprocurement.gov.in.

COMMISSIONER

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం ఇదే..

డ్రైయినేజీలో మృతదేహం లభ్యం

విజయనగరం కోట: నగరంలోని దాసన్నపేట రైతు బజారు దగ్గరలోగల కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించినట్లు టూటౌన్‌సిఐ శ్రీనివాసరావు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు.. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అతడి శరీరంపై ఎరుపు రంగ షర్టు, చేతిపై వి.ఆదిలక్ష్మి అని రాసిన పచ్చబొట్టుఉన్నాయని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వేట్రాక్‌పై మహిళ మృతదేహం

విజయనగరం కోట: డొంకినవలస, బొబ్బిలి రైల్వేస్టేషన్ల మధ్య గొల్లాది రైల్వేగేటు దగ్గరలో ట్రాక్‌పై గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. ఆమె వయసు సుమారు 40-50 సంవత్సరాల మధ్య ఉంటుందని, 5 అడుగుల ఎత్తు కలిగి, చామన ఛాయరంగు, పసుపు రంగు పై ఆకు పచ్చ, ఎరుపు రంగు మచ్చలు కలిగి సిమెంట్ రంగు బోర్డర్ కలిగిన చీర ధరించి ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 949061 7089, 0891-2883218 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

విజయనగరంకోట: ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్సుమెంట్ సిఐ ఇందిరా దేవి ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావు, సిబ్బంది నగరంలోని కమ్మ వీధిలో టి.బాలాజీ అనే వ్యక్తిని 15 మద్యం బాటిల్స్‌తో పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈదాడిలో హెచ్‌సి నాగేశ్వరావు, సుదర్శన్, ఇసి నాయుడు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని గాయాలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి మీద చొక్కాపు వాని చెరువు వద్ద ఆర్‌టిసి బస్సు వెనుక నుంచి ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న బంకరు బాబ్జీ (73) గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నం షీలా నగర్ ప్రాంతానికి చెందిన బాబ్జీ సంక్రాంతి పండగకు రామభద్రపురం బంధువుల ఇంటికి వచ్చి ఇక్కడ సరదాగా గడిపి ఆదివారం వేరే బంధువుల ఇంటికి బొబ్బిలి వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. క్షత గాత్రుడుని బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అప్పారావు తెలిపారు.

జూదగాళ్లు అరెస్టు

డెంకాడ: మండలంలోని ఆకుల పేట సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుంచి 40,950 రూపాయలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. వారి వద్ద నుంచి 8 సెల్ ఫోన్లు ఒక మోటార్ సైకిల్ సీజ్ చేశామన్నారు.

నోటీసు
మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
IA 22/15 in OS 201/15

Between :
దిండి కనకం వగైరాలు .....పిటిషనర్స్/వాదులు
And :
బియ్యపు సన్యాసమ్మ (died) మరియు ఇతరులు
........రెస్పాండెంట్లు/ప్రతివాదులు

పై దావాలోని IA 22/15 లో 2వ రెస్పాండెంటు అయిన దిండి వసంత W/o చంద్రరావు, భీమసింగి గ్రామం, జామి మండలం వారికి నోటీసు సర్వే కానందున ప్రత్యామ్నాయంగా ఈ పత్రికా ప్రకటన ద్వారా నోటీసును కోర్టువారు ఆర్డరు జారీ చేసియున్నారు. పై దావా వాయిదా **తేది 03-02-2025**న వాయిదా అయి ఉన్నది. కావున దిండి వసంత (2వ రెస్పాండెంట్ స్వయంగా గాని వారి తరపు న్యాయవాది ద్వారా గాని **ఉదయం 10-30 గం॥**లకు హాజరై తమ వాదనను వినిపించవలసినదిగా కోర్టువారు ఆదేశించియున్నారు. లేని ఎడల వారికి పరోక్షముగా కోర్టువారు నిర్ణయం తీసుకొందురు.

కూరెళ్ళ నాగభూషణరావు,
శిరిపురపు సత్యారావు,
న్యాయవాదులు,
కె.ఎల్.పురం, విజయనగరం

విజయనగరం
తేది: 19-01-2025